## కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మరు



అక్బర్‌బాగ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మలక్‌పేట బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి తదితరులు

సైదాబాద్, నవంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ ఎన్ని గ్యారెంటీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని మలక్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి అన్నారు. సోమవారం అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీగల అజిత్ రెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా ముందుకు నడిపించడానికి దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధులను ప్రవేశపెట్టి వారి అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రజా సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్షగా పనిచేస్తాయని, హ్యాట్రిక్ విజయంతో మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. కాలనీ, బస్తీవాసులు బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూసారాంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎం. శ్రీధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జగన్ గుప్తా, మాజీ డివిజన్ అధ్యక్షుడు మోహన్ రావు, అజయ్, శరత్, లక్ష్మమ్మ, రాధ, వెంకట్, ఉపేంద్ర, దామోదర్, కవిత, నర్సింగ్, అలీఖాన్, సాజీద్ బాయ్, నితేష్, రూప, దేవి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బాలల హక్కుల వారోత్సవాలు

సైదాబాద్, నవంబర్ 20: బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు సోమవారం సైదాబాద్‌లో ముగిసాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలల సంక్షేమం, సంస్కరణలు, వీధి బాలల సంక్షేమ శాఖ జువైనల్ అబ్జర్వేషన్ హోంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) హైదరాబాద్ జిల్లా ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ గువ్వల రాధిక హాజరయ్యారు. చిన్నారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు తమ ఉజ్వల జీవితాలను మెరుగుపర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని, సన్మార్గంలో పయనించడానికి అనేక మార్గాలు ఉన్నాయని, వాటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. చిన్నారుల హక్కులకు భంగం కలిగించకుండా వారిలో చైతన్యం కలిగించే విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అజ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ సయ్యద్ అఫ్జల్ షాహేలీ, హరిణి, సంధ్యారాణి, హోం సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

**రూ. 10.71 లక్షల సొత్తు స్వాధీనం**

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వరల్డ్ కప్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 10.71 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితిక పంత్ కథనం ప్రకారం.. బోయిన్‌పల్లికి చెందిన మహేశ్ రమేశ్ మన్యాల్, తేజస్ థక్కర్ ఇటీవల జరిగిన వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ నిర్వహించారు. ఢిల్లీకి చెందిన రాఖీ అనే బూకీ వద్ద నుంచి ఆన్‌లైన్ యాప్‌లకు సంబంధించిన ఐడీ, పాస్‌వర్డ్‌లు తీసుకొని బెట్టింగ్ నిర్వహించారు. ఫంటర్ల పెట్టుబడిపై 30 శాతం లాభాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో చెక్‌బెట్.కో వెబ్‌సైట్ ద్వారా రూ. 6,89,075 విలువైన 6,89,075 పాయింట్లు కొనుగోలు చేశారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి బృందానికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు.

## తాను మరణిస్తూ.. మరో నలుగురికి బతుకునిచ్చి..

మాదాపూర్, నవంబర్ 20: తాను మరణిస్తూ మరో నలుగురికి అవయవదానం చేశాడు శ్రీపతి శ్రీనివాస్ గౌడ్ (49). కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ 20 ఏండ్ల కిందట కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి.. మియాపూర్‌లో ఉంటూ సాక్షి దిన పత్రికలో అడ్వర్టయిజింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.గత బుధవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో హాస్పిటల్‌లో చేరి.. ఆదివారం బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. దీంతో అతడి అవయవాలను (గుండె, లివర్, రెండు కిడ్నీలు) ఇతరులకు దానం చేయాలని కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో అవయవాలను దానం చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతరం పలు పత్రికలకు చెందిన జర్నలిస్టులు, తోటి సహచరులు ఆయన మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

# కంటోన్మెంట్‌లో విజయఢంకా మోగిస్తాం

- క్రిస్టియన్ మైనారిటీలంతా గులాబీ వైపే
- క్రిస్టియన్ ఆత్మీయ సమావేశంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్




కంటోన్మెంట్‌లో జరిగిన క్రిస్టియన్ ఆత్మీయ సమావేశంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్

కంటోన్మెంట్, నవంబర్ 20: క్రిస్టియన్ మైనార్టీలంతా సెక్యులర్ పార్టీ బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్ స్పష్టం చేశారు. క్రిస్టియన్లకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ వచ్చిన తర్వాత క్రిస్టియన్లకు అన్ని విధాల అండగా ఉంటున్నారని వెల్లడించారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు ప్రశాంతంగా ఉన్నాయని, ఇతర పార్టీలు తమకు అవసరం లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్.. కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత గెలిచి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లోని కేజేఆర్ గార్డెన్స్‌లో క్రిస్టియన్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టీఫెన్ సన్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితతో పాటు ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్. శ్రీనివాస్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్‌తోపాటు నేతలు దేవేందర్, టీఎన్ శ్రీనివాస్, నర్సింహ ముదిరాజ్, ఖదీరవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత మాట్లాడుతూ.. అన్ని వర్గాలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నాయని చెప్పారు. క్రిస్టియన్ సమాజమంతా తనకు ముక్తకంఠంతో మద్దతు పలకడం మరిచిపోలేనన్నారు. అందరూ నిండు మనసుతో తనను దీవించి, భారీ మెజార్టీతో గెలిపించాలని లాస్యనందిత కోరారు. మరోవైపు ఎమ్మెల్సీ ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితను సొంత బిడ్డలా భావించి గెలిపించాలని కోరారు. అన్ని పార్టీలు తిరిగొచ్చిన బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పాస్టర్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత, నామినేట్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌తో పాటు ఎమ్మెల్సీ ప్రభాకర్, ఎంఎన్ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జులియన్, పాస్టర్ మనోహర్, పాస్టర్ అరుణ్ విక్టర్, పాస్టర్ మేరీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

*బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్*



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబర్ 20 : జూబ్లీహిల్స్‌లో మూడోసారి విజయం సాధించడం ఖాయమని నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 30 దాకా బూత్‌స్థాయిలో కార్యకర్తలు మరింత చురుగ్గా ఉండాలని, గెలుస్తామనే ధీమాతో అలసత్వం వహించొద్దని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బోరబండ డివిజన్ బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాగంటి గోపీనాథ్ పాల్గొని మాట్లాడారు. ఇంటింటి ప్రచారంలో ప్రతి ఓటర్‌ను కలిసి ప్రభుత్వ పథకాల గురించి వివరించాలని సూచించారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ, మంచినీటి సమస్యల పరిష్కారం, దళిత్ స్టడీ సర్కిల్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని, తప్పుడు ప్రచారాలతో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో బోరబండ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కృష్ణమోహన్, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, విజయసింహారెడ్డి, ఇన్‌చార్జి సిరాజ్, భూపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వయంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారనుకోండి..

- గోషామహల్ అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ను గెలిపించండి
- చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా

అబిడ్స్, నవంబర్ 20 : గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ తరపున స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పోటీ చేస్తున్నారనుకుని పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా పిలుపునిచ్చారు. సోమవారం ధూల్‌పేటలో జరిగిన మంగళ్‌హాట్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల జరిగిన రోడ్‌షోలో మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే.. తాను నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని కోట్లాది రూపాయల నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ విజయం సాధించేందుకు పాటు పడాలన్నారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ.. పట్టుదలతో పనిచేసి గోషామహల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ విజయానికి పాటు పడదామన్నారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.రవికుమార్, శ్రీశైలం, శ్రీనివాస్ యాదవ్, శశిరాజ్ సింగ్, హెచ్.కుమార్, బల్‌దీప్ సింగ్, రాజేందర్ సింగ్, రాజేందర్, అమిత్‌కుమార్, దినేశ్‌సింగ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగ్ రావు మృతి

**నివాళులర్పించిన మంత్రి తలసాని, ఎమ్మెల్యే ముఠా గోపాల్**

కవాడిగూడ, నవంబర్ 20 : సీనియర్ జర్నలిస్ట్, ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రం నర్సింగ్‌రావు సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నర్సింగ్ రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాయంత్రం బన్సీలాల్‌పేటలోని హిందూ శ్మశాన వాటికలో నర్సింగ్‌రావు అంత్యక్రియలు జరిగాయి. నర్సింగ్ రావు కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

### పలువురు ప్రముఖుల నివాళి..

సీనియర్ పాత్రికేయులు ఎర్రం నర్సింగ్ రావు మరణ వార్త తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ అభ్యర్థి పూస రాజు, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, రామకృష్ణ మఠం స్వామీజీ బోధమయానంద, శితికంటా నంద, బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్లు వి. శ్రీనివాస్ రెడ్డి, వాజీద్ హుస్సేన్‌తో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు, పెద్ద ఎత్తున జర్నలిస్టులు, నర్సింగ్‌రావు మృతదేహాన్ని సందర్శించి.. పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నర్సింగ్‌రావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

## ఘరానా దొంగ అరెస్ట్

*8 కేసులు ఛేదించిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్*

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ ఘరానా దొంగను అరెస్ట్ చేశారు. డీసీపీ నితిక పంత్ కథనం ప్రకారం.. కాలాపత్తార్‌కు చెందిన అబ్దుల్ మాజీద్‌ఖాన్‌పై 20కి పైగా దొంగతనాలు, స్నాచింగ్ కేసులున్నాయి. బంజారాహిల్స్ పోలీసులు అతడిపై 2019లో పీడీ యాక్టు కూడా ప్రయోగించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత తిరిగి దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఈ నెలలో నారాయణగూడ, అబిడ్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు బైక్‌లు చోరీ చేశాడు. ఆ బైక్‌లపై తిరుగుతూ సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తున్నాడు. ఈ దొంగతనాలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో.. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని అరెస్ట్ చేసింది. అతడిని విచారించడంతో రాంగోపాల్‌పేట, చిలకలగూడ, బేగంబజార్, మొఘల్‌పురా, మలక్‌పేట, కామాటిపురా, అబిడ్స్, నారాయణగూడ పోలీసేష్టన్ల పరిధిలో తొమ్మిది సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు దొంగిలించినట్టు ఒప్పుకున్నాడు.